డిక్కీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలి

● జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ సోషల్ జస్టిస్



మాట్లాడుతున్న కన్వీనర్ డాక్టర్ సుహార్లత

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దళిత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఆవిర్భవించిన దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) సభ్యుల అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జి, సీబీఐచే విచారణ జరిపించాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ సోషల్ జస్టిస్(జేఏసీఎస్.జే) కన్వీనర్ డాక్టర్ సుహార్లత ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ కో-కన్వీనర్లు పుట్టపాగ శ్రీనివాస్, పీఆర్.సోమశేఖర్, రాగటి భవానీ కుమార్, మునిస్వామితో కలిసి ఆమె మాట్లాడారు. గొప్ప లక్ష్యంతో ఆవిర్భవించిన సంస్థను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ అండదండలతో కోట్లాది రూపాయలు పక్కదారి పట్టించారని మండిపడ్డారు. సమావేశంలో జేఏసీ నాయకుడు సాయిబాబా, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులకు శిక్షణ శిబిరం

ఖైరతాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల అధికారులకు, ఉన్నతాధికారులకు మధ్య వారధుల్లాంటి సెక్టార్ అధికారులు ఎన్నికల నియమావళిని చదువుకొని అమలు చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గ సెక్టార్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఇందులో ఆయనతో పాటు సహాయ రిటర్నింగ్ అధికారి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖాడేతో కలిసి పలు సూచనలు చేశారు. పోలింగ్ రోజున ఇబ్బందులు తెలెత్తకుండా ఈవీఎంల కమిషనింగ్ జాగ్రత్తగా చేయాలని కోరారు. కేంద్రాలకు కేటాయిన పోలింగ్ అధికారులకు జరిగే శిక్షణలో సెక్టార్ అధికారులు పాల్గొంటే ఉపకరంగా ఉంటుందని తెలిపారు. సెక్టార్ అధికారులు వారికోసం తయారైన ఎన్నికల విధుల శిక్షణ పుస్తకాన్ని చదివి వాటిని తప్పకుండా పాటించాలని కోరారు. శిక్షణలో ఖైరతాబాద్ నియోజకవర్గ ఈఆర్ఓ, డీసీ ప్రశాంతి, ఏఈఆర్‌వోలు అనితారెడ్డి, సాయి శ్రీనివాస్, సంజయ్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు మంచి భవనాన్ని నిర్మిస్తాం

● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ భవనాన్ని అన్ని హంగుల తో అద్భుతంగా నిర్మించి ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారితో ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 20కోట్లు ఖర్చు అయినా సరే ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఉండే పాత్రికేయుల కోసం అన్ని హంగులతో కూడిన భవనాన్ని నిర్మించి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ప్రజల పక్షాన పని చేసే పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ప్రస్తుతం ప్రెస్‌క్లబ్‌లో నిర్మిస్తున్న మహిళా భవనానికి తన స్వచ్ఛంద సంస్థ నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని, ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ నాయుడు, రవి కాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కోశాధికారి రాజేష్, సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్, ఈసీ మెంబర్లు వనజ, శ్రీను, సీనియర్ పాత్రికేయులు యూసుఫ్ బాబా, ఆజంఖాన్ పాల్గొన్నారు.

దానంను గెలిపించుకుందాం: విజయారెడ్డి

ఖైరతాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి అన్నారు. సోమవారం ఖైరతాబాద్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రచారంపై చర్చించారు.







హత్యకు గురైన తేజస్ అంత్యక్రియలు పూర్తి



తేజస్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

అమీర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ బతుకమ్మ కుంట వద్ద ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురైన దాసారం బస్తీకి చెందిన తేజస్ అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. పోస్టుమార్టం అనంతరం సాయంత్రం సనత్‌నగర్ వెల్ఫేర్ గ్రౌండ్‌కు తీసుకొచ్చిన అతడి మిత్రులు అంబులెన్స్‌కు తేజస్ ఫ్లెక్సీ ఫొటోను ఏర్పాటుచేసి, మృతదేహాన్ని ర్యాలీగా బల్కంపేట వైకుంఠధామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు గత దసరా పండుగ రోజున దాసారం బస్తీ గ్రౌండ్‌లో హత్య కేసులో తేజస్ ముద్దాయిగా ఉన్నాడు.



● మధురానగర్ కాలనీ సీ-37లో సోమవారం రాత్రి వీసిన ఈదురు గాలులకు రహదారిపై చెట్టు కొమ్మ విరిగి తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయపడ్డారు. జీహెచ్ఎంసీ అత్యవసర విభాగం, విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చామని మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు కోడె సాంబశివరావు తెలిపారు.

- వెంగళరావునగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

● ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎంసెట్ క్లాసుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో సెకండ్ ఇయర్ క్లాసులు నడుపుతున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పృథ్వి, కళ్యాణితో కలిసి ఆమె మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సెలబస్ పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో విద్యార్థుల మానసిక, శారీరక స్థితిని దృష్టిలో ఉంచుకోకుండా సెలవుల్లో కూడా గంటల తరబడి క్లాసులు నిర్వహిస్తూ వత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఇంతవరకు ఇంటర్ అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేయక ముందే 90శాతానికి పైగా అడ్మిషన్స్, 60శాతం ఫీజు కూడా వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం, ఇంటర్ బోర్డు అధికారులు స్పందించి కార్పొరేటు కళాశాలలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



హోర్డింగ్ మీద పడి.. ఒకరికి గాయాలు

బంజారాహిల్స్: పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తిపై హోర్డింగ్ పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పంజాగుట్టకు చెందిన సూరజ్ కుమార్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లోని మెరీడియన్ హోటల్లో సోమవారం రాత్రి విధులు ముగించుకొని ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ మీదుగా నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో గాలులు వీయడంతో చౌరస్తాలో ఉన్న బహుళ అంతస్థుల భవనంపై నుంచి ఓ ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన హోర్డింగ్ ఒక్కసారిగా వూడి సూరజ్ కుమార్‌పై పడింది. సూరజ్‌కు గాయాలవ్వడంతో స్థానికులు నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యువకుడిపై దాడి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన ఘటన సోమవారం మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పల్నాడు జిల్లాకు చెందిన మేముల శ్రీనివాసరావు ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఎస్ఆర్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద బస్సు దిగాడు. ఓలా ఆటో కోసం ఎదురు చూస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు యువకులు వచ్చి అతడిపై దాడిచేసి సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిపోయారు. బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా వ్యక్తిపై..

యూసుఫ్‌గూడ: విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న వ్యక్తిని మద్యం మత్తులో దాడి చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రహ్మత్‌నగర్‌లో నివాసముండే జి.రమేష్ కుమార్ మాదాపూర్‌లోని బిగ్ టీవీలో డ్రైవర్. 7వ తేదీ విధులు ముగించుకొని అర్ధరాత్రి 11.30 గంటలకు ఇంటికి వెళ్తున్నాడు. కార్మికనగర్‌కు చేరుకునే సరికి అర్ధరాత్రి ఒంటిగంట అవుతుంది. ఆ సమయంలో అక్కడ తన సోదరుడి మిత్రుడు రాజు కలిశాడు. రాజుతో పాటు అతడి సోదరుడు రోహిత్ బెల్లా కూడా మద్యం మత్తులో ఉన్నాడు. అకారణంగా రోహిత్ బెల్లా దుర్భాషలాడడం మొదలు పెట్టాడు. ఎందుకు అలా మాట్లాడతావు అని అడగడంతోనే దాడి చేసి వీపుపై పిడిగుద్దులు గుప్పించాడు. పెద్దరాయి తీసుకుని రమేష్ బైక్‌పై వేయడంతో బైక్ దెబ్బతినింది. దీంతో బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి అదృశ్యం

యూసుఫ్‌గూడ: బజారుకు వెళ్లొస్తానని చెప్పిన వ్యక్తి తిరిగి రాలేదు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన గుడియ శంకర్ రహ్మత్‌నగర్‌లోని తన అల్లుడు గిరిధర్ వద్ద ఉంటూ హోటల్ సర్వెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీ సాయంత్రం 6గంటల ప్రాంతంలో బయటకు వెళ్లొస్తానని చెప్పి రాలేదు. గరిధర్ తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.







ఆరవ వార్డులోని గణేశ్ నగర్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

గణేశ్‌నగర్ కాలనీలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు పరిధిలోని గణేశ్ నగర్ కాలనీలో మురుగు కాలువ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా ఈ మ్యాన్‌హోల్ పూర్తిగా కుంగిపోయింది. దీనికితోడు వాహనాలు రాకపోకలతో మ్యాన్‌హోల్ పూర్తిగా పాడైపోయింది. ఈ క్రమంలో నిత్యం ఈ ప్రాంతం నుంచి పక్కనే ఉన్న స్కూల్‌కు పిల్లలను తీసుకువెళ్తున్న వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాలలో మ్యాన్‌హోల్‌ను గుర్తించని పాదచారులు ఈ ప్రాంతంలో ప్రమాదాలకు గురవుతున్నారు. రెండురోజుల క్రితం ఓ వ్యక్తి సైకిల్ నడిపిస్తూ మ్యాన్‌హోల్ వద్ద పడిపోవడంతో గాయాలపాలు కావడం జరిగిందని స్థానికులు తెలిపారు. జరగరాని ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మత్తులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది

మార్కెట్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో ఫ్లాగ్‌మార్చ్


రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కింగ్ దర్బార్ రోడ్, మోండా ఎక్స్ రోడ్డు, పాట్ మార్కెట్, ఇస్లామియా స్కూల్, ఆదయ్యనగర్ ప్రాంతాలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మహంకాళి డివిజన్ ఏసీపీ సర్దార్ సింగ్, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పర్యవేక్షణలో 80 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



పికెట్ చౌరస్తా వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాజకీయ రిజర్వేషన్లలో
మాదిగలపై కాంగ్రెస్ వివక్ష

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 17 స్థానాలలో మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంట్ స్థానాలలో ఒక్కస్థానం కూడా మాదిగలకు ఇవ్వలేదని, తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా ఎక్కువ ఉన్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలపై వివక్ష చూపిస్తూ మాదిగలను అవమానపరిచారని కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకుడు శ్రీకిషన్ మాదిగ అన్నారు. అంతేకాకుండా కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నికలో కూడా మాదిగలకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించలేదని నిరసిస్తూ సోమవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని జేబీఎస్ వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకుడు శ్రీకిషన్ మాదిగ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అజిత్ కళ్యాణ్, రొట్టెల సునీల్ మాదిగ, కొంపల్లి శ్రీకాంత్ మాదిగ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిలుకూరి అమరవరప్రసాద్

కోయ భాష అకాడమీని ఏర్పాటు చేయాలి

- పాఠ్యాంశాలను ముద్రించి ప్రాథమికవిద్యగా బోధించాలి
- కోయ భాష లిపి సృష్టికర్త చిలుకూరి అమరవరప్రసాద్

బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన కోయ భాషను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అకాడమీని ఏర్పాటు చేయాలని కోయ భాష లిపి, సృష్టికర్త చిలుకూరి అమరవరప్రసాద్ కోరారు. కోయభాష లిపితో పాఠ్యాంశాలను ముద్రించి ప్రాథమిక విద్యాస్థాయిలో బోధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కోయ భాష సంస్కృతి, అభివృద్ధి సంస్థ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోయ భాషలో పాఠ్య పుస్తకాలను ముద్రించి 1 నుంచి 5వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధించాలని కోరారు. కోయ భాష లిపిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కోయలు జీవనం సాగిస్తున్న చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో కూడా కోయ భాష లిపిని అమలు చేయాలని కోరారు. త్వరలో రవీంద్రభారతిలో రెండు రోజుల పాటు కోయ సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

భాషాభివృద్ధికి కోయ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ రేగా రాజేందర్, అధ్యక్షుడుగా గొండి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా కె.శంకర్‌రావు, సెక్రటరీ జనరల్‌గా ప్రొఫెసర్. జి.అనురాధ, జనరల్ సెక్రటరీగా ప్రొఫెసర్ కిషోర్, కోశాధికారిగా డాక్టర్ కె.పద్మజ, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పూసం వెంకటలక్ష్మి నియమితులైనట్లు ఆయన తెలిపారు.

పేదలపై ప్రభుత్వం 'డబుల్' నిర్లక్ష్యం

- బీజేపీ ఎంపీ ఈటల రాజేంద్

మారేడుపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వడం పట్ల తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. సోమవారం మోండా డివిజన్ పరిధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓల్డ్ మారేడుపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆయన పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పూర్తయి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చినప్పటికీ ఆ ఇళ్లను అలాట్‌మెంట్ చేయడంలేదని లబ్ధిదారులు ఈటల రాజేందర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎలక్షన్ కోడ్ ముగిశాక లబ్ధిదారులకు న్యాయం చేకూరేలా బీజేపీ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. బైఎలక్షన్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ తరఫున



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

పోటీ చేయడానికి రెండు మూడు రోజుల్లో స్థానిక అభ్యర్థి అధిష్ఠానం ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, నాయకులు టోపీ శంకర్, పిట్ల నాగేశ్, హరిప్రసాద్, మోహన్‌సింగ్, గోనె సత్యనారాయణ, రాజ్‌గోపాల్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఈటల రాజేందర్

తిరుమలగిరి : బోరా ముస్లింల ఐక్యత సమాజానికి మేలు చేస్తుందని మల్కాజ్‌గిరి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. రంజాన్ పురస్కరించుకుని తిరుమలగిరిలోని బోరా ముస్లింల ఆహ్వానం మేరకు ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నాటికి కూడా బోరా ముస్లింలు ఒకే దగ్గర భోజనం చేయడం హర్షించదగ్గది అన్నారు. వీరి ఐకమత్యం సమాజానికి స్ఫూర్తి అని కొనియాడారు. బోరా ముస్లిం కమ్యూనిటీ ఘనంగా సత్కరించారు. ఇఫ్తారులో కమ్యూనిటీకి చెందిన వారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కమిటీ సభ్యులు యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో మండల పూజ

అడ్డగుట్ట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్టలోని మార్కండేయ సహిత శివ పంచాయతన దేవాలయంలో మండల పూజ మహోత్సవం జరిగిన 41 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆలయంలో భక్తులు మండల పూజలు ఘనంగా జరుపుకున్నారు. అభిషేకం, రుద్రహోమం, మహాసంప్రోక్షణ వంటి ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు సంతోష్, ప్రధాన కార్యదర్శి చిలివేరి రామకృష్ణ, యజ్ఞంలో శ్రీనివాస్, ఆనందాస్ వెంకటేశ్, బొడ్డు రాకేష్ దంపతులు పూజలు పాల్గొన్నారు



మార్కెండేయ ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

అవయవదానంపై అవగాహన కోసం జేఏసీ

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అవయవ, నేత్ర దానంపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి సామాజిక భావజాలం కలిగిన అన్ని అసోసియేషన్‌లు, ఆర్గనైజేషన్లు జేఏసీగా ఏర్పడి కృషి చేయాలని తీర్మానం చేశారు. సోమవారం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ప్రాంతంలో ఉన్న వాసన్ ఐ బ్యాంకు ఆవరణలో తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రజల్లో అవగాహన లేకపోవడం వలన మృతి చెందిన వారి నేత్రాలు, అవయవాలు మట్టిలో కలిసిపోతున్నాయని అన్నారు. అవయవాలు దొరకక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రమోషన్ సంస్థ, సదాశయ ఫౌండేషన్, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోషియేషన్, జై భారత్ సమస్త, ది ఛేంజ్ వేల్ఫేర్ సొసైటీ, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లాల్‌బజార్ శ్రీమహంకాళి దేవాలయంలో ...
అమావాస్య ప్రత్యేక పూజలు



మహంకాళి దేవాలయంలో అన్నదానం



హోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమం

తిరుమలగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ మహంకాళి దేవాలయంలో అమావాస్య సందర్భంగా అమ్మవారికి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. కంటోన్మెంట్ బోర్డ్ మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్‌కుమార్ సహకారంతో దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం వద్ద ప్రతీ అమావాస్యకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా సోమవారం అమావాస్య సందర్భంగా అన్నదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీశంకర్, బోర్డ్ మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, పి.రాజు, రాజా రెడ్డి, వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఉమేష్, కార్మిక విభాగం ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, పాండురంగం, చిన్నా, రామ్‌చందర్ (సింహం), టీఎస్ఎంఆర్‌పీఎస్ కోర్ కమిటీ మెంబర్ వేణుగోపాల్, ఆనంద్, సతీష్‌గౌడ్, సురేష్, విజయలక్ష్మి, లత పాల్గొన్నారు.

అన్నదానం

రాంగోపాల్‌పేట్ : అమావాస్య సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి దేవస్థానంలో నూతనంగా చేపట్టిన రుద్ర సహిత ఆయుష్య హోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ సురిటి రామేశ్వర్, ధర్మకర్తల మండలి సభ్యులు రామమోహన యాదవ్, మాణిక్‌రావు, కే.ఎం.కృష్ణ, మహేందర్, అరుణ్ భట్, దుబాయ్ శ్రీను, ఆలయ అనువంశిక ధర్మకర్త సురిటి కామేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్ : మావాస్యను పురస్కరించుకుని సోమవారం జామై ఉస్మానియా గాంధీబొమ్మ వద్ద ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్, అడికమెట్, బౌద్ధనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకుడు సుంకు రామచందర్, వైశ్యఫెడరేషన్ అధ్యక్షుడు బెలిదే రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ హైదరాబాద్‌కు మంచి భవనాన్ని నిర్మిస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ భవనాన్ని అన్ని హంగులతో అద్భుతంగా నిర్మించి ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారితో ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, తాము ఈ ఏడాది చివరి నాటికే భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. రూ.20 కోట్లు ఖర్చు అయినా సరే ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఉండే పాత్రికేయుల కోసం అన్ని హంగులతో కూడిన భవనాన్ని నిర్మించి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ప్రజల పక్షాన పని చేసే పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ప్రస్తుతం ప్రెస్‌క్లబ్‌లో నిర్మిస్తున్న మహిళా భవనానికి తన



ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఇఫ్తార్ వేడుకలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

స్వచ్ఛంద సంస్థ నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని, ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ నాయుడు, రవి కాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కోశాధికారి రాజేష్, సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్, ఈసీ మెంబర్లు వనజ, శ్రీను, సీనియర్ పాత్రికేయులు యూసుఫ్ బాబా, ఆజం ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

హయత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో ఓ యువకుడు జాతీయ రహదారిపైన వర్షం నీటి కోసం నిర్మించిన నాలా శ్లాబ్ మీద మృతదేహం ఉంది. హయత్‌నగర్ పోలీసులు కథనం ప్రకారం.. అనాజీపూర్ గ్రామానికి చెందిన ఎర్రుల ఉదయ్‌కిరణ్(21) ఉమర్‌ఖాన్‌గూడలో భారత్ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి మూడు గంటలకు నిద్రలేచి పెట్రోల్ బంకులో పడుకుంటానని ఇంటి నుంచి వచ్చాడు. సోమవారం ఉదయం పెద్దఅంబర్‌పేట్ వద్ద గల కజారియా టైల్స్ గోదాం ఎదురుగా విజయవాడ జాతీయ రహదారి మధ్యలో వర్షం నీటి కోసం నిర్మించిన నాలాసిమ్మెంట్ దిమ్మపై మృతదేహం ఉంది. బైకు కూడా అక్కడే పడి ఉంది. ఉదయ్‌కిరణ్ పెద్దఅంబర్‌పేట్‌కు ఎందుకు వచ్చాడో అనుమానాస్పదంగా మారింది. వరద కాలువను ఢీకొని చనిపోయాడా లేక గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తండ్రి నరసింహ ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తాం

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీగణేశ్

మారేడుపల్లి ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డు పరిధిలోని సంజీవయ్యనగర్ కాలనీలో మహేష్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీకి చెందిన నాయకులు, మహిళా నాయకులు కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీగణేశ్ సమక్షంలో చేరి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి సంజీవయ్యనగర్ కాలనీ బస్తీలోని వాడవాడలా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే ప్రజల సంక్షే



సంజీవయ్య నగర్‌లో కూరగాయల సంతలో ప్రజలను కలుస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తున్న శ్రీ గణేశ్

మమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన సాగుతుందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారులకు గ్యారెంటీగా అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాకే ముందుకు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. మోండా డివిజన్ పరిధిలోని మారేడుపల్లి లోహినగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్.డి. నాగేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రజలతో ముఖాముఖి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ ఛైర్మెన్ కొత్త సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు రంగా రవీందర్‌గుప్తా, బాబురావు, సందీప్‌యాదవ్, భరత్, విక్కి, సాయి, జనార్ధన్, మోండా డివిజన్ మహిళా విభాగం అధ్యక్షులు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రాములు

బంగారు గొలుసు దొంగతనం.. ఇద్దరి అరెస్ట్

అల్వాల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అర్ధరాతి సమయంలో ఒక వ్యక్తిపై దాడి చేసి అతని మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయిన ఇద్దరు నిందితులను అల్వాల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, నిందితుల వివరాలను వెల్లడించారు. అల్వాల్ సూర్యానగర్ ప్రాంతంలో నివసించే వరికుప్పల జంపన్న(20), పాలమౌని గౌతమ్ ఇద్దరు స్నేహితులు. కాగా ఈనెల 6న అర్ధరాత్రి సమయంలో నిందితులు బాగా మద్యం తాగి సూర్యానగర్‌లో తిరుగుతున్నారు. అదే సమయంలో సూర్యానగర్‌కు చెందిన సురేందర్‌రెడ్డి తన ఇంటి ముందు నిలబడి సిగరేట్ తాగుతున్నాడు. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో అతడిని కొట్టి మెడలో ఉన్న బంగారు చైన్‌తో పాటు సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. వెంటనే బాధితుడు సురేందర్‌రెడ్డి అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం పోలీసులు ఓల్డ్‌అల్వాల్ ఇందిరాగాంధీ విగ్రహం పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా నిందితులు జంపన్న, గౌతమ్‌లు అనుమానాస్పదంగా యాక్టీవా బైక్‌పై వెళ్తుండగా పోలీసులు ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి విచారించగా చైన్ దొంగతనం వివరాలను చెప్పారని ఏసీపీ వివరించారు. నిందితుల నుంచి ఒక తులం బంగారు గొలుసు, యాక్టీవా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో కీలక భూమికను పోషించిన అల్వాల్ స్టేషన్ హౌజ్‌ఆఫీసర్ రాహుల్‌దేవ్, డీఐ రాజేందర్‌గౌడ్, క్రైమ్ సిబ్బంది విద్యాకర్‌రావు, గౌస్‌పాషా, రమాకాంత్, సుధాకర్‌లను ఏసీపీ అభినందించారు.



రైల్వే స్టేషన్ అవుట్ గేట్ వద్ద ట్రాఫిక్‌జాం కాకుండా చూస్తున్న పోలీస్

ట్రాఫిక్ ఏసీపీ చొరవతో తీరిన ..
రైల్వే ప్రయాణికుల ట్రాఫిక్ సమస్య

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ జామ్‌ల నుంచి ఉపశమనం లభించింది. రైల్వే స్టేషన్ సమీపంలోకి వచ్చి రోడ్డు మీద ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కొని సమయానికి చేరుకోలేక ప్రయాణం రద్దు చేసుకోవడం లేదా వేరో ట్రైన్‌కు వెళ్లే పరిస్థితి ఉండేది. ముఖ్యంగా ఉదయం 5 గంటల నుంచి 8 గంటల మధ్య రైళ్లకు వెళ్లే ప్రయాణీకులు తరచుగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్య పరిష్కారం కోసం నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ప్రత్యేక చర్యలు తీసుకుని ట్రాఫిక్ జామ్‌లు లేకుండా రైల్వే ప్రయాణికులు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవడంపై ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న ముగ్గురు ట్రాఫిక్ పోలీసుల సంఖ్యను 8 మందికి పెంచడంతో పాటు ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. రైల్వే స్టేషన్ ఇన్ గేట్ వద్ద ఇద్దరు, అవుట్ గేట్ వద్ద ఇద్దరు, అల్ఫా హోటల్, గురుద్వారా, 31 బస్టాప్ వద్ద ఒక్కరు చొప్పున ట్రాఫిక్ పోలీసులను ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు నియమించడంతో ట్రాఫిక్ జామ్‌లు లేకుండా నివారించారు. ప్రతి రోజు ట్రాఫిక్ ఏసీపీ పర్యవేక్షించడంతో ట్రాఫిక్ జామ్‌లు లేకుండా సమయానికి ప్రయాణీకులు రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్నారు. ముందుగా రిజర్వేషన్ చేసుకుని ట్రాఫిక్ జామ్ కారణంగా సకాలంలో రైల్వే స్టేషన్‌కు చేరుకోలేక ఎక్కవలసిన రైలు వెళ్లిపోతే ప్రయాణీకులు అసహనానికి గురవుతారు.దూరప్రాంతం నుంచి స్టేషన్ సమీపంలోకి వచ్చి ట్రాఫిక్ జామ్‌ల కారణంగా ట్రైన్ మిస్ కావద్దని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ శంకర్‌రాజు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాగుడికి బానిసైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొల్లారం బజారు సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... బొల్లారం బజారుకు చెందిన ఎ.ప్రభాకర్ (41) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడికి బానిసై జీవితంపై విరక్తి చెందిన ప్రభాకర్ బొల్లారం బజారులోని రైల్వే ట్రాక్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కదులుతున్నరైలు ఎక్కబోయి ..



శివ మృతదేహం

ప్లాట్ ఫాంపైకి వస్తున్న రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి రైలు కిందపడి బలమైన గాయాలతో చికిత్స పొందుతూ మరణించిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన శివ(45) సోమవారం ఊరెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ప్లాట్ ఫాం నెంబరు 2లో నిలబడి ఉండగా ఫలక్‌నుమా రైలు ప్లాట్ ఫాంకు వస్తుండగా కదులుతున్న రైలు జనరల్ బోగిలో ఎక్కబోతు ప్రమాదవశాత్తు రైలు కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



కోరె మౌనిక

బౌద్ధనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం పార్శిగుట్ట సంజీవపురంలో నివాసముండే మంగ ఐలయ్య కుమార్తె కోరె మౌనిక(29)కు రెండు సంవత్సరాల క్రితం కోరె కనకయ్యతో వివాహం జరిగింది. కనకరాజు పోలియో వ్యాధిగ్రస్తుడు కావటంతో ఆరునెలల క్రితంభర్తను వదిలి మౌనిక పుట్టింటికి వచ్చింది. ఈనెల 4వ తేదీన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మౌనిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. మౌనిక కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేకపోవటంతో తనకుమార్తె కనిపించటంలేదని శుక్రవారం రాత్రి తండ్రి ఐలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

10 కిలోల గంజాయి పట్టుకున్న పోలీసులు

హయత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బైకుపైన హైదరాబాద్‌కు తరలిస్తున్న 10 కిలోల గంజాయిని మహేశ్వరం ఎస్‌ఓటీ, హయత్‌నగర్ పోలీసులు కలిసి హైవే బావర్చి జేసీబీ జంక్షన్ వద్ద పట్టుకున్నారు. ధూల్‌పేట్, ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లలో వివిధ కేసుల్లో ముద్దాయిగా ఉన్న సికింద్రాబాద్ కవాడిగూడకు చెందిన మోతిలాల్ నర్సింగ్ బాలాజీసింగ్ (37) అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండలో 10 కిలోల గంజాయిని స్థానికుడైన రాము వద్ద కొనుగోలు చేశాడు. సుజుకి బర్గ్‌మాన్ బైకు పైన పెట్టుకుని హైదరాబాద్‌కు బయలు దేరాడు. విశ్వసనీయ సమాచారంతో మహేశ్వరం ఎస్‌ఓటీ, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా హయత్‌నగర్ బవార్చి హోటల్ వద్ద ఆదివారం రాత్రి కాపుకాచి పట్టుకున్నారు. వెంటనే మోతిలాల్ నర్సింగ్ బాలాజీసింగ్‌ను అతడి వద్ద 7 ప్యాకెట్లలలో ఉన్న 10 కిలోల గంజాయిని, ఒక సెల్ ఫోన్, బైకును స్వాధీనం చేసుకున్నారు. రాము పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. నిందితునిపైన అనేక కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. సోమవారం నిందితున్ని రిమాండుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.